క్లుప్తంగా

నేడు ఆత్మీయ సమ్మేళనం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల మధ్య మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. గ్రామంలోని మాచనూర్ తుల్జప్ప ఇంటి ఎదుట మురుగు చేరి.. పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో కాలనీ వాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదే విషయం అనేకసార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

షెడ్డు కూల్చివేతపై గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

కుల్కచర్ల: రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నిరుపేద వ్యక్తి వేసుకున్న రేకుల షెడ్డును కూల్చివేశారని ఆరోపిస్తూ.. చెల్లాపూర్ గ్రామస్తులు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంజన్ గౌడ్.. సర్వే నంబరు 55లో రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కాగా రెండురోజుల క్రితం రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో ప్రభుత్వ స్థలంలో ప్రవేటు వ్యక్తులు షెడ్డు నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధం అంటూ కూల్చివేశారు. దీంతో గురువారం గ్రామస్తులు కొందరు కూల్చివేతను నిరసిస్తూ ఆందోళన దిగారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రయ్య మాట్లాడుతూ.. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా షెడ్డును కూల్చడం దౌర్జన్యమే అవుతుందన్నారు. ఎస్‌ఐ గిరి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పేర్కొన్నప్పటికీ.. నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మించారని, అందుకే చట్టపరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు



మరమ్మతు చేసిన పైప్‌లైన్

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'నీటి సమస్యను పట్టించుకోరా?' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తా కథనానికి గ్రామ కార్యదర్శి అంజ్యానాయక్ స్పందించారు. 6వ వార్డు పాత సివిల్ ఆసుపత్రి పక్కనే ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంకు వద్ద పైప్‌లైన్ జాయింట్ విడిపోగా.. 22 రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగి.. స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఇదే అంశంపై 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో కార్యదర్శి స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయించడంతో నీటి సరఫరా చేశారు.

సర్పంచులకు సన్మానం

ధారూరు: జాతీయ పంచాయతీ అవార్డులు సాధించిన చింతకుంట, కేరెళ్లి సర్పంచులు లక్ష్మమ్మ, నర్సింహ్మారెడ్డిలను మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. సన్మానించిన వారిలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప ఉన్నారు.

ఆరుగురు గైర్హాజరు

కొడంగల్ రూరల్: పదో తరగతి పరీక్షలకు గురువారం ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 4 కేంద్రాల్లో 881మందికి 875 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ కల్వ కోటి రాంరెడ్డి తెలిపారు. పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎంఈఓ చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

దోమ: దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బహుజన్ ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్ అన్నారు. గురువారం గొట్లచెల్కతండా అనుబంధ గ్రామమైన ముత్లకుంటతండా, మల్లేపల్లి తండాలో హనుమాన్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం దేవాలయాల అభివృద్ధికి ముత్లకుంట తండాకు విరాళం అందజేశారు.

బీటీరోడ్లకు మోక్షమెప్పుడో?

ప్రతి పల్లెకు బీటీరోడ్లు ఏర్పాటు వేసి, గ్రామాలను ప్రగతిపథంలో నడిపిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా అడుగులు పడడం లేదు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి మారుమూల గ్రామాలు నేటికీ బీటీరోడ్లకు నోచుకోలేదు. ఇదిగో రోడ్డు.. అదిగో అంటూ పాలకులు కాలయాపన చేస్తున్నారే కానీ.. కార్యరూపం దాల్చడం లేదు. దీంతో పల్లెలకు బీటీరోడ్లు అందని ద్రాక్షగానే మిగిలాయి.

- కలగా మారిన రహదారుల నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా.. మట్టిరోడ్లపైనే ప్రయాణాలు
- అస్తవ్యస్తంగా రవాణా సౌకర్యం
- ఇబ్బంది పడుతున్న పల్లెజనం



కొత్తపల్లి గ్రామ రోడ్డు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఎక్కువగా మారుమూల ప్రాంత గ్రామపంచాయతీలు ఉన్నాయి. ముఖ్యంగా మండల పరిధిలో ఉన్న గిరిజన తండాలకు బీటీరోడ్లు లేక.. అభివృద్ధికి ఆమడదూరంలోనే నిలిచిపోతున్నామని గిరిజనులు వాపోతున్నారు. కుల్కచర్ల పరిధిలో బొంరెడ్డిపల్లి, సూర్యానాయక్ తండా, గోప్యానాయక్, సుబ్యానాయక్, ఘనాపూర్, హన్మ్యనాయక్, భోజ్యనాయక్, పటేల్ చెరువు, చాకల్‌పల్లి తండాలు ఉన్నాయి. చౌడాపూర్ పరిధిలో కొత్తపల్లి, పుర్సంపల్లి, మల్కాపూర్, బంగ్రంపల్లి, మేగ్యనాయక్ తండా తదితర గ్రామాలకు బీటీరోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

హామీలు పట్టని నేతలు

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలు.. ఇచ్చే హామీలకు విలువలేకుండా పోయిందని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయకులు చెప్పిన మాటలు ఉత్తవేనని గ్రామాల పరిస్థితి చూస్తే తెలుస్తోందని వాపోతున్నారు. గ్రామాలకు బీటీరోడ్లు వేయిస్తామని ఓట్లు వేయించుకుంటున్నారే కానీ.. నెరవేర్చడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

బస్సు లేక బడి మానేశారు..



మా గ్రామానికి బీటీరోడ్డు లేదు. ఉన్న మట్టిరోడ్లు వర్షాలకు అధ్వానంగా మారాయి. దీంతో ఆర్టీసీ బస్సులు పల్లెలకు రావడం లేదు. ఫలితంగా పదో తరగతి పూరైన కొందరు విద్యార్థినులు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువు మానేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి బీటీరోడ్డు వేయించాలి.

– రఘు, కొత్తపల్లి

తరుచూ రోడ్డు ప్రమాదాలు



మా ఊరుకి బీటీరోడ్డు వేయాలని ఐదు సంవత్సరాల నుంచి కోరుతున్నాము. కానీ మా గోడు వినిపించుకునే వారే కరువయ్యారు. మట్టిరోడ్డుపై ద్విచక్ర వాహనాలు జారీ కిందపడుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్రగా గాయపడుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– హరికృష్ణ, బొంరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపించాం..



కొత్తపల్లి, బొంరెడ్డిపల్లి, పుర్సంపల్లితో పాటు పలు గ్రామాలకు బీటీరోడ్డు వేసేందుకు తాము అంచనాలతో సహా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– ఉమేష్, డీఈ పంచాయతీరాజ్, కుల్కచర్ల

తాండూరు అభివృద్ధే ధ్యేయం

- గృహలక్ష్మి ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి
- ఈ నెలాఖరు నుంచి ప్రారంభం
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: 'మునుపెన్నడూ లేని విధంగా ఒక్కో గ్రామానికి రూ.50 లక్షల నిధులు వెచ్చించాను. గతంలో ఏ పాలకులు తాండూరును పట్టించుకోలేదు. నేను లోకల్. తాండూరు అభివృద్ధే నా ధ్యేయం' అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు పైలెట్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూర్, అంతారం, చెన్‌గేస్‌పూర్, ఎల్మకన్నె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గృహలక్ష్మి కింద నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తోందని, ఈ నెల ఆఖరు నుంచి అర్హులు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. సర్పంచ్ చంద్రప్ప, నాగప్ప, గోవింద్, నరేందర్‌రెడ్డి, అంతారం రాములు, నాగమణి, ఎంపీటీసీ నర్సమ్మ, నరేందర్‌రెడ్డి, నాయకులు ఉమాశంకర్, రాంలింగారెడ్డి, కేశవరెడ్డి, యాదప్ప, రాజు, ప్రవీణ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

సమన్వయంతో పనిచేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బట్టు లలిత

మర్పల్లి: ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ బట్టు లలిత అధికారులకు ఆదేశించారు. ఆమె అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేస్తే మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయాలని భగీరథ ఏఈకి చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తే.. ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. మరిన్ని అంశాలపై చర్చించిన అనంతరం.. మిగతా శాఖల పరిధిలో చేపడుతున్న పనులను సంబంధిత అధికారులు ఎజెండా అంశాలను చదివి వినిపించగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ మధుకర్, కోఆప్షన్ సభ్యుడు సోయెల్, ఎంపీడీఓ రాజమల్లయ్య, ఎంపీఓ మహేశ్‌కుమార్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలో మట్టిరోడ్లకు మహర్దశ

- గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



రోడ్డుపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పరిగి: గ్రామాల లింకులను కలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేదుకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి కాళ్లాపూర్, నుంచి మల్కాపూర్ వరకు రూ.15లక్షల నిధులతో మట్టిరోడ్డు నిర్మాణ పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. మట్టిరోడ్డు ఉన్న పల్లెలకు త్వరలోనే బీటీరోడ్లు వేయిస్తామని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కళ్లాపూర్ నుంచి సయ్యాద్ మల్కాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పరిగికి వెళ్లేందుకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర దూరం తగ్గనందుని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, సర్పంచ్ జంగయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య, రవీందర్, జగన్, సత్తయ్య, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



నవాబుపేట: శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: అంధత్వ నివారణనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటివెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని పరీక్షలు చేసి అవసరమై వారికి శస్త్ర చికిత్సలు చేయడం, మందులు, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అజయ్‌కుమార్, డాక్టర్లు రోహిత్, జగదీష్, సిబ్బంది రాధిక, రేఖ, ఏఎన్‌ఎంలు సంపూర్ణ, అంజలి, అంగన్‌వాడి టీచర్ జగదాంబా గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమలో

దోమ: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కృష్ణ అన్నారు. గురువారం దాదాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం దేవాలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. ఉదయాన్నే భక్తులు శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేసి, స్వామివారిని దర్శనం చేసుకోగా.. గుడి పరిసర ప్రాంతాలన్నీ జై శ్రీరాం నామస్మరణతో మారుమోగాయి. భజరంగ్‌దల్, విశ్వహిందూ పరిషత్, హిందు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, శోభాయాత్రలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



యాలాల: జుంటుపల్లిలో..



అనంతగిరి: పల్లకీ సేవలో ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ దంపతులు



పరిగి: పూజాకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బంట్వారం: సుల్తాన్‌పూర్..



కొడంగల్ రూరల్: బ్రాహ్మణవీధిలో..



తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్‌లో



అనంతగిరి: చైర్‌పర్సన్ మంజుల దంపతులు



మోమిన్‌పేట: టేకులపల్లిలో శోభాయాత్ర..



బొంరాస్‌పేట: రేగడిమైలారంలో..

కాషాయ జెండా రెపరెపలు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో ఘనంగా జరిగింది. పార్టీ కార్యాలయాలు, పలు కూడళ్లలో కమలనాథులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని, విశ్వఖ్యాతిని గడించిందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక జాతీయ పార్టీ బీజేపీ అని, అలాంటి పార్టీకి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని వెల్లడించారు. – సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కార్యకర్తలు, నాయకులు



యాలాలలో..



పెద్దేముల్‌లో..



కుల్కచర్లలో..



మర్పల్లిలో.. పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్



కొడంగల్ రూరల్‌లో..



పూడూరులో..

బిల్లు వంద.. వసూలు వెయ్యి!



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

- లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి
- బెల్ట్ దుకాణాలను మూసివేయాలి
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ధారూరు: విద్యుత్ బిల్లు రూ.వంద వస్తే లైన్‌మెన్ రూ.వెయ్యి వసూళ్లు చేస్తున్నారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేరెళ్లి ఎంపీటీసీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మీటర్ రీడింగ్, వచ్చిన, కట్టిన బిల్లును చూపించారు. దీనికి స్పందించిన మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి.. లైన్‌మెన్‌పై తగిన చర్యలకు సిఫారసు చేస్తామని చెప్పారు. లైన్‌మెన్ చెప్పినట్లు కాదని, ఎంత బిల్లు వస్తే అంతే చెల్లించాలని ఏఈ సూచించారు. గురువారం ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు గ్రామల్లోని సమస్యలు లేవనెత్తగా.. సంబంధిత అధికారులు సమాధానం చెప్పారు. సాగు భూముల్లో కరెంట్ మోటార్లు పెట్టుకోవడానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వమంటే సంవత్సరం గడిచినా ఇవ్వడం లేదని, అదే ఫాంహౌజ్‌లకు 24 గంటల్లో కనెక్షన్లు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని గడ్డమీది గంగారం సర్పంచ్ అమర్‌నాథ్ ప్రశ్నించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారులను సర్పంచ్ నర్సింహారెడ్డి కోరారు. ఉపాధి నిధులతో ఫార్మెషన్ రోడ్లు నిర్మించాలని ప్రయత్నిస్తుంటే.. కొంతమంది రైతులు అభ్యంతరం చెబుతూ పనులు సాగనివ్వడం లేదని ఏపీఓ సురేశ్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. రైతు వేదికల్లో సౌకర్యాలు కల్పించాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి సభలో ప్రస్తావించారు. రైతు వేదికలు నిర్మించిన వారికి ఇంకా పూర్తి బిల్లులు రాలేదని, మండల పరిషత్ లేదా జీపీల ద్వారా నిర్మిస్తే రికార్డు చేయించి బిల్లు ఇప్పిస్తామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిప్యూటీ ఈఈ మాధవరెడ్డి చెప్పారు.

గల్లీకో బెల్ట్ దుకాణం

గల్లీకో బెల్ట్‌షాపు ఉంది. వాటిపై చర్యలు తీసుకోవాలని రాంపూర్‌తండా సర్పంచ్ పాండునాయక్ కోరగా.. ఫిర్యాదు చేస్తే చర్యలుంటాయని ఎస్‌ఐ చెప్పారు. దీంతో దుకాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో మీకు తెలియదా అని సర్పంచ్ ప్రశ్నించారు. మున్నూరు సోమారంలో ఏడేళ్ల క్రితం జీపీ భవనానికి స్లాబ్ వేసి వదిలేశారని, దానిని ఎప్పుడు పూర్తి చేస్తారని ఎంపీటీసీ రవి పీఆర్ డీఈఈ మాధవరెడ్డిని ప్రశ్నించగా.. ఆ భవన నిర్మాణానికి తగిన నిధులు లేవని, కొత్తగా నిర్మించడానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని డీఈఈ వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.